# విమాన దోపిడి

## భీమవరపు పురుషోత్తం

భూమికి ఎన్నో మైళ్ళ ఎత్తుగల ప్రదేశం అది! ఇండియాకు చెందిన ఇంటర్నేషనల్ ఎయిర్ బస్ అక్కడి ప్రదేశాన్నంతా-ఒకరకమైన మంద్రపాటి శబ్దంతో నింపుతూ, మేఘాల్ని చీల్చుకుంటూ సాగిపోతూంది....మనీలానుండి వస్తూందది ఇండియాకు....

సుందరరాజన్ సీటింగ్ హాలుకి టాయిలెట్స్‌కి మధ్యగల నడవాలోకి వచ్చాడు. స్టిక్ ఆధారంతో కొద్దిగా కుంటుతున్నట్టు అడుగులు వేస్తున్నాడతను. సన్నగా, పొడుగ్గా వున్నాడతను. మీసాల్లేని చామన ఛాయ ముఖం!

అరనిమిషం ఆగాడక్కడ. ఇంతలో చప్పుడయింది. తెల్లగా స్లిమ్‌గా ఉన్న ఎయిర్ హోస్టస్ నవ్వు ముఖంతో వస్తూంది. అతడిని సమీపించింది.

నమ్రతగా అడిగిందామె. "వాట్ ఆర్ యూ డూయింగ్ హియర్!"

పెదాలు నాలుకతో తడుపుకొని తల తిప్పాడు సుందరరాజన్. అతడి కంగారు స్పష్టంగా తెలుస్తోంది!

ఎయిర్ హోస్టెస్ కనుబొమ్మలు ముడిపడ్డాయి! ఆమె యేదో అనబోయింది. ఇంతలో....కొద్ది దూరంలో వున్న టాయిలెట్స్ గోడ వెనుకనుండి ఇద్దరు దృఢకాయులు చురుగ్గా వచ్చారక్కడికి!

అప్రయత్నంగా అడుగు వెనక్కి వేసిందామె. క్షణంలో ఇద్దరూ ఆమెను బంధించారు. అరవకుండా నోటికి ప్లాస్టర్ అంటించారు గట్టిగా....

ఎదురుగా వున్న చిన్న రూమ్ పై ఇంగ్లీషు అక్షరాలు కనిపిస్తున్నాయి, 'కీపింగ్ రూమ్' అని. మూసి వున్న తలుపుపై చిన్నగా తట్టాడు సుందరరాజన్.

వెంటనే చేతిలో స్టిక్ తీసి ఎయిర్ హోస్టెస్ కు ఆనుకొని, స్టిక్ ని ఆరంగుళాలవరకూ పట్టుకొని లాగాడు. తెల్లగా మెరుస్తూ స్టిక్ లో దాగివున్న కత్తి బయటికి వచ్చింది. కత్తి ఎయిర్ హోస్టెస్ పీకకు ఆనించాడు ...

కీపింగ్ రూమ్ తలుపు తెర్చుకుంది. స్టెన్ గన్ ధరించిన గార్డు పొజిషన్ లోనికి రాబోయాడు ఎదురుగా దృశ్యం చూసి. అప్పటికి వాళ్ళు లోపలికి వచ్చేశారు. దృఢకాయులిద్దరూ తలుపుమూసేసి పిస్టల్స్ తీసి ముందు వరిశారు!

గదిలోపల మరో నలుగురు గార్డులున్నారు. అందరి వద్దా ఆయుధాలున్నాయి. ఇలాంటి సంఘటనల్ని ఎంతో ఎలర్టుగా యెదుర్కొనేవాళ్ళు సైతం వాళ్ళ మెరుపు దాడికి నివ్వెరబోయారు!

"మీ రెవరయినా ఫైరింగ్ చేస్తే ఈమె పీక తెగిపోతుంది తక్షణం!" తడబడుతున్న పెదాలతో ఇంగ్లీషులో

కర్కశంగా హెచ్చరించాడు సుందరరాజన్.

చెమటతో దుస్తులు తడిసిపోగా, రెప్పలు సాగదీసి వెర్రిగా చూస్తూండిపోయింది, ఆ హఠాత్పరిమాణం నుండి ఇంకా తేరుకోని ఎయిర్ హోస్టెస్.

దృఢకాయులిద్దరూ రెండు స్టెన్‌గన్‌లు స్వాధీనం చేసుకొన్నారు. గార్డులు వెనక్కు తగ్గారు. తెల్లగా లోపలి నరాలు కనిపిస్తూన్నంత సున్నితంగా ఉన్న ఎయిర్ హోస్టెస్ కంఠంపై పదునుగా బిగుసుకొంటూన్న కత్తి చూసే కేవలం గార్డులు ఏ చర్యా తీసుకోలేక పోతున్నారు. విమానపు సిబ్బంది ప్రాణాలు కాపాడ్డం కూడా గార్డుల బాధ్యతే!

సుందరరాజన్‌కి కంగారుగా వుంది. ఎయిర్ హోస్టెస్ యేక్షణాన్నయినా స్పృహతప్పి కిందికి జారిపోయేలా వుంది. ఈ లోపల పని చక్కబెట్టుకోవాలి. తర్వాత గార్డుల్ని ఆపడం కష్టం.

చురుగ్గా హెచ్చరించాడు. "డేనియల్, కోదండం... క్విక్!"

అంతే!—దృఢకాయులిద్దరూ పిస్టల్ పైకెత్తారు. వాళ్ళెంతవు తెగిస్తారనుకొంటే గార్డులు ఎటాక్ చేసేవారే! కానీ అప్పటికే ఆలస్యం అయింది....! సైలెన్సర్ అమర్చిన పిస్టల్స్ మెత్తగా మోగాయి. వెంటవెంటనే ముగ్గురు గార్డులు నేలకొరిగిపోయారు!

అది చూసి తలుపు తీసిన గార్డు వెర్రికోపంతో ఉగ్రుడయిపోయాడు....ముందుకురికి శత్రువులు స్వాధీనం చేసుకొన్న స్టెన్‌గన్ అందుకొన్నాడు.

అప్పటికే సుందరరాజన్ పెద్ద కంఠంతో హెచ్చరించడంవల్ల, డేనియల్ ఆ గార్డువైపు పిస్టల్ గురిచూసి

పేల్చాడు. స్టెన్ గన్ వెనక్కి పడేసి వెల్లకిలా పడిపోయా డతడు.

సుందరరాజన్ వెంటనే కత్తి ఎయిర్ హోస్టెస్ కంఠంపై నుండి తొలగించి స్టిక్ పిడితో, జరిగేదంతా నిశ్చేష్టురాలై చూస్తున్న ఐదవగార్డు తలపై మోదాడు. క్షణాలలో అతడు నేలకొరిగిపోయాడు....అప్పుడు వెది కాయి సుందరరాజన్ కళ్ళు తమకు కావలసిన వస్తువు కోసం! కాసేపటికి ముగ్గురు గుర్తించారు దానిని.

గోడమూలగా వరుసగా పేర్చి వున్న విమానంలో ఉపయోగించే చిన్న చిన్న ఉడ్ ఫర్నిచర్స్ మధ్య ఒక పెద్ద టేబుల్ పై ఉందది!?

అది లెదర్ బాగ్!!

## 2

కోదండం అస్వస్థంగా పడున్న గార్డులవద్ద వెదికి తాళాల గుత్తి తీసాడు. మొత్తం నాలుగు తాళా లున్నాయి. నాలుగు తాళా'లుతీసి బాగ్ మూత తెరి చాడు....

ముగ్గురి చూపులు పెట్టెలోపల అతుక్కుపోయాయి. ఆ పెద్దపెట్టె నిండుగా కొత్త నోట్లు తళతళలాడుతూ ముగ్గురినీ ఊరిస్తున్నాయి.

ఇజ్రాయిల్ లోని ఇండియన్ బాంక్ నుండి ఇండియా లోని బాంకులకు రొటేషన్ అవుతున్న ఇండియాన్ కరెన్సీ అది!

తృప్తిగా నిట్టూర్చి సుందరరాజన్ పెట్టెమూసి తాళాలు వేసి, వాటిని పక్కకు విసిరేశాడు. ఇక వాటి అవసరంలేదు. డేనియల్ ఈ లోపల ఎయిర్ హోస్టెస్ ని ఒక మూల కట్టిపడేశాడు. అప్పటికే

భయంతో బిగుసుకొనిపోయిన ఆమె తల పక్కకు వాల్చి మగతగా ఉండిపోయింది.

టైమ్ చూశాడు సుందరరాజన్. "మన ప్లేన్ సమీపించ బోతున్నాం — త్వరగా మిగతా కార్యక్రమం జరపాలి!" చెప్పాడు.

డేనియల్ చెప్పాడు. "నువ్వు యిక్కడి సంగతి చూడు. మేము కేబిన్‌లోనికి పోయివస్తాం...."

సుందరరాజన్ తలూపాడు. వాళ్ళు రూమ్ దాటి వెలుపలికి వెళ్ళేటప్పుడు చెప్పాడు. "బీ కేర్‌ఫుల్!"

వాళ్ళిద్దరూ వెళ్ళిపోయాక ఆ గదంతా వెతకసాగాడతడు. కీపింగ్ రూమ్‌లోనే పేరాచూట్స్ వుంటాయన్న విషయం అతడికి తెలుసు!

కాసేపటికి అతడి ప్రయత్నం ఫలించింది. ఒక పొడవాటి షెల్ఫ్‌లో పేరాచూట్స్ కనిపించాయి. విమానానికి యేదయినా ప్రమాదం సంభవిస్తే ప్రయాణీకుల ప్రాణాలు రక్షించడానికి ఉపయోగిస్తారవి.

నాలుగు పేరాచూట్‌లను భుజాన వేసుకొని, లెదర్ బాగ్‌ను నేలమీదనుండి ఈడ్చుకొంటూ హేండ్‌స్టిక్‌తో కొద్దిగా కుంటుతూ గది తలుపులు తెరుచుకొని నడవాలోనికి వచ్చాడతడు.

తలుపులు తెరవగానే సీటింగ్ హాలులో నుండి వస్తూన్న రణగొణధ్వని అతడి చెవులబడింది. చేతిలో తేలికైన ఆయుధం లేకపోయినా అతడికి భయంలేదు. బాగ్‌ను ఈడ్చుకొంటూ హాలులోనికి రాసాగాడు....

ఇంతలో చిన్న కుదుపు! ప్రయాణీకుల హాహాకారాలు ఎక్కువయ్యాయి. కుదుపుతో పాటూ విమానం స్లో అయ్యింది బాగా!

సుందరరాజన్ ముఖంలో చిరునవ్వు ప్రత్యక్షమైంది. ఆనందంతో అతడి హృదయం గంతులేసింది. అతడికి కావల్సింది అదే! వేసిన ప్లానంతా అంచెలంచెలుగా అమలు జరుగుతూంటే అతడి ముఖం తృప్తిగా వెలిగి పోతూంది.

కేబిన్‌లో నుండి డేనియల్, కోదండం బయటికి వచ్చారు. వాళ్ళ చేతుల్లో గార్డ్సుని చంపి స్వాధీనం చేసుకొన్న స్టెన్‌గన్‌లు ప్రయాణీకుల్ని భయభ్రాంతుల్ని చేస్తున్నాయి.

ప్రయాణీకులు ఒకరిద్దరు భయంతో మూర్ఛపోయారు. కొందరు కళ్ళుమూసుకొని దైవప్రార్థన చేసుకొంటు న్నారు. మరికొందరు వాళ్ళు ముగ్గురూ అంతవరకూ తమ మధ్యే సాధారణ ప్రయాణీకుల్లా నటించిన వాళ్ళని గుర్తించి నివ్వెరపోతున్నారు. వైమానిక సిబ్బంది అస మర్థతను తిట్టుకొంటున్నారు. మిగతా వాళ్ళు వాళ్ళ ముగ్గుర్నీ ఆసక్తిగా చూస్తున్నారు.

"అంతా సవ్యంగా జరిగిందా?" ప్రశ్నించాడు సుందరరాజన్.

డేనియల్ తల పంకించాడు. కోదండం "అంతా ఓ.కే. కోపైలట్‌ని గాయపర్చి ప్లేన్ స్లో చేయించాం!" చెప్పాడు.

"సరే! ఇవి ధరించండి" అంటూ రెండు పేరాచూట్లు వాళ్ళవైపు విసిరాడు.

క్షణాల్లో ముగ్గురూ పేరాచూట్లు ధరించారు. లెదర్ బాగ్‌ను కూడా పేరాచూట్‌కి కట్టి, దానికి తన పేరా చూట్‌కి అడ్డంగా ఓ పొడవాటి తాడును బిగించి కట్టాడు సుందరరాజన్. అతడు తన హేండ్‌స్టిక్‌ను

పోగొట్టుకోవడం ఇష్టంలేక భద్రంగా కోటునుండి క్రిందికి దోపుకున్నాడు.

వాళ్ళు పేరాచూట్‌లు ధరించే తతంగం అంతా గమనించి ప్రయాణీకులు మనసులో సంతోషించారు. ప్లేన్ హైజాక్ చేసి తమను ముప్పుతిప్పలు పెట్టకుండా, వాళ్ళ తోవన వాళ్ళు పోతున్నందుకు రిలీఫ్‌గా ఫీలవుతున్నారు ప్రయాణీకులు.

స్టెన్‌గన్‌లు నడుంపై బిగించుకొని దూకడానికి రెడీ అయ్యారు. డేనియల్ ఆటోమేటిక్ ఎంట్రన్స్ డోర్‌ని పక్కకు తప్పించాడు. తుపాకీ గుండంత వేగంగా లోపలికి దూసుకొని వచ్చినగాలి వాళ్ళ ఊపిరి స్తంభింపజేస్తూంది. ఒకరినొకరు కళ్ళతో హెచ్చరించుకున్నారు....

ప్రయాణీకులు విభ్రాంతిగా చూస్తున్నారు....

## 3

ముందు సుందరరాజన్ పెట్టెను తోసేసి ఏకకాలంలో తనూ దుమికాడు క్రిందికి. వెనగ్గా డేనియల్, కోదండం గాలి వేగానికి కళ్ళు చికిలించి దూకేశారు!!

కొన్ని సెకన్‌ల తర్వాత పేరాచూట్లు విచ్చుకొన్నాయి. గాలి వత్తిడికి వణికిపోయే గాలిపటాలవలె ముగ్గురు అల్లల్లాడుతూ అన్నిమైళ్ళ ఎత్తునుండి అతి మెల్లగా తేలుతున్నట్టు దిగసాగారు....!

గాలి విసురుకి కొద్దిగా కళ్ళు మూసుకొన్న సుందరరాజన్ కళ్ళు విప్పి స్పష్టంగా చూశాడు. అతడి కనుబొమ్మలు ముడిపడ్డాయి.

గాలి విసురు అతడు ఊహించిన దానికంటే ఎక్కువగా వుంది. కాష్ వున్న లెదర్ బాగ్ తాడుతో కట్టడంవలన, కొద్దిదూరంలో అతడి పేరాచూట్‌కి

సమాంతరంగా ఎగురుతూంది.

డేనియల్, కోదండం దూరంగా చిన్నగా కనబడు తున్నారు. వాళ్ళు కూడా దాదాపు అతడి ఎత్తుకు సమంగానే ఉన్నారు.

మరికొద్దిసేపు గడిచింది. సుందరరాజన్ అనుమానం బలపడుతుంది! అప్రయత్నంగా అతడి వెన్ను జలదరించింది భయంతో!?

ఏటవాలుగా వస్తున్న గాలికి ఉక్కిరిబిక్కిరి అయిపోతున్నాడతడు....ఆ ప్రాంతంలో కొండచరియలు యెక్కువగా వుండడంవల్ల గాలులు యెక్కువగా వుంటాయక్కడ. ఒక్కొక్కసారి అవి నార్మల్ పాయింట్‌ను మించి వుంటాయి. అలాంటప్పుడే అవి దగ్గరలో ఉన్న సముద్రంలో వాయుగుండాలు, అధిక పీడనాలు ఏర్పడడానికి చాలా పాత్ర వహిస్తాయి.

ప్రస్తుతం అలాంటి గాలే తమను వెంటాడుతూందని గ్రహించడానికి ఎంతో సమయం పట్టలేదు సుందరరాజన్‌కు!

దూరంగా డేనియల్ కోదండాలు నీళ్ళల్లో మునిగి ఉక్కిరిబిక్కిరి అవుతున్నవాళ్ళలా కాళ్ళూ చేతులు అస్తవ్యస్తంగా ఆడించడం అతడికి కనబడుతూంది....అంతవరకూ తన ప్రక్కనే ఉన్న అదృష్టదేవత ఇప్పుడు తప్పుకోవడం సుందరరాజన్‌కి వెర్రి పుట్టిస్తోంది. అతడికి తల తిరుగుతున్నట్టనిపిస్తోంది!

గాలి విసురు మరింత పెరిగిందని గ్రహించాడు. ఏ క్షణాన్నైనా అతడి దుస్తుల్ని చీలికలు చేయడానికి సిద్ధంగా ఉన్నట్టుంది గాలి. ముఖ్యంగా చెవుల్లోకి ముఖం మీదికి కొడుతున్న గాలి అతడికి స్పృహ తప్పేలా

చేస్తూంది....దూరంగా డేనియల్ కోదండంల పరిస్థితిలో కూడా మార్పులేదు!

చెవుల్లోకి దూరే గాలి డయాఫ్రంను చీల్చి తమను శాశ్వతంగా చెవిటివాళ్ళను చేస్తుందేమో నన్న భయం పుట్టింది అతడికి.

బాగా ఎత్తునుండి పేరాచూట్ల ద్వారా క్రిందికి దిగే సైనికులు వాడే హెల్మెట్లు వుంటే, తమ పరిస్థితి కొంత వరకూ చక్కబడుననిపించింది.

సుందరరాజన్ ఆలోచనల్లో కొట్టుమిట్టాడుతూనే వున్నాడు. వాళ్ళు క్రిందికి దిగడానికి బదులు కొద్దిపాటి ఏటవాలుగా గాలి అలలలో అలా కొట్టుకొనిపోతూనే వున్నారు....

పరిస్థితి అర్థం చేసుకొన్న సుందరరాజన్, తాము ఇప్పుడప్పుడే క్రిందికి దిగే అవకాశం మాత్రం లేదని గ్రహించగలిగాడు.

తాము లేండ్ అవడానికి ముందే నిర్ణయించుకొన్న ప్రదేశంలో అప్పటి వాతావరణపరిస్థితి పూర్తిగా తెలుసుకోనందుకు, ప్లాను గురించి లోతుగా ఆలోచించనందుకు తనను తానే తిట్టుకొన్నాడు. లెదర్ బాగ్ ను వేరే విడవకుండా తన పేరాచూట్ కు కలిపి మధ్యలో తాడు కట్టినందుకు మాత్రం ఆ సమయంలో కొద్దిగా సంతోషించాడు.

కళ్ళు చికిలించి క్రిందికి చూడడానికి ప్రయత్నించసాగాడతడు. కనీసం తామెక్కడున్నామో అయినా తెలుసుకోవాలని వుందతడికి. తెల్లటి మేఘాల మధ్య నుండి నీలంరంగు కనిపిస్తూంది అతని కళ్ళకు! క్రమంగా ఆ రంగు నీళ్ళని గ్రహించాడు....తమ చావు ఖచ్చితంగా

సముద్రపు నీళ్ళలో లేనని అతడికి నమ్మకం కుదిరింది.

కళ్ళు మూసుకొన్నాడు. సముద్రపు హోరులా వినిపిస్తూన్న గాలి, చల్లగా స్పృశిస్తూన్న మేఘాలు తెలుస్తున్నా యతడికి. క్రమంగా అతడికి స్పృహ తప్పింది....!!

## 4

మెల్లగా కళ్ళు విప్పాడు సుందరరాజన్. చిన్న చిన్న కొమ్మలు అతడి చుట్టూ ఉన్నాయి అల్లుకొన్నట్టు. వెంటనే లెదర్ బాగ్ గుర్తుకు రావడంతో త్రుళ్ళిపడి కదిలాడు. ఒళ్ళంతా చితక్కొట్టినట్టు ఉండడంతో అతడి ప్రయత్నం ఫలించలేదు.

అతడి ఆలోచనలు స్తబ్ధత వదిలి కదిలాయి. డేనియల్ కోదండం అతడి స్మృతిపథంలోకి వచ్చారు. అసలు తనెక్కడున్నాడో అర్థం కాలేదతడికి.

'లెదర్ బాగ్' మాట పెదాలు దాటి బయటకు రాక పోయినా నోట్లోనే గొణుక్కున్నాడు. శక్తినంతా కూడగట్టుకొని అతి కష్టంమీద పైకి కదిలాడు. నడుం దగ్గర కలుక్కుమంది. తడిమి చూసుకున్నాడు. ఎర్రగా కనిపించింది రక్తం! విరిగిన ఎండుకొమ్మ గుచ్చుకొని గాయం అయిందక్కడ.

భారంగా ఊపిరి వదిలి ఒక విరిగిన పొడవాటి కొమ్మ సహాయంతో అక్కడినుండి పైకి లేచాడు. కోటులో దాచిన అతడి హేండ్‌స్టిక్ రెండుగా విరిగిపోయి వుంది. ఆశ్చర్యంగా చుట్టూ చూశాడు. దట్టమైన అరణ్యంలా ఉంది అదంతా!

పక్షుల అరుపులు మాత్రం యెక్కువగా వినిపిస్తూన్నాయి. దూరంగా వెలుతురు తగ్గుతూండడం గమనించి

బాగా సాయంత్రం అయ్యిందని గ్రహించాడు. నడుముకు కట్టుకొన్న పేరాచూట్ బెల్టు విప్పుకొన్నాడు. అతడి పేరాచూట్ తాళ్ళు ఓ సన్నటి చెట్టుకు తగులుకొని దాన్ని విరిచేశాయి.

ఒంటిమీద అక్కడక్కడా వున్న చిన్న చిన్న గాయాలను లెక్క చేయకుండా, ఆత్రంగా కళ్ళతో చుట్టూ తడిమాడు....

అతడి కళ్ళు మెరిసాయి. సమీపంలో ఒక పొదలో ఇరుక్కొన్న పేరాచూట్ కనిపించింది. అతడి పేరాచూట్ కు కట్టిన త్రాడు ఆ పొదవైపు ఉంది!

విరిగిన హేండ్ స్టిక్ కత్తి వున్న భాగం తీసికొని అతి కష్టంమీద కుంటుకొంటూ అక్కడికి చేరుకొన్నాడు. ఎక్కువ శ్రమ పడకుండానే అతడి పేరాచూట్ బెల్టు ఉన్న భాగం కనిపించింది.... బెల్టు విప్పేసి ఖాళీగా ఉంది!?

ఆ ప్రదేశంలో ఎక్కడా లెదర్ బాగ్ మటుకు కనిపించలేదతడికి....!?

ఆయోమయంతో పిచ్చెత్తిపోతోంది సుందర రాజన్ కు. మనిషి రొప్పుతున్నాడు. బాగ్ గాలి తుఫానులో ఎక్కడయినా జారిపోయిందేమోనన్న ఆలోచన అతడిని కృంగదీస్తోంది.

ఇంతలో, చెట్టు మొదలువైపు కాగితమేదో ఆకర్షిందతడిని. ఆశ్చర్యంతో దానిని తీసి చదివాడు.

"రాజన్,

నీ ప్లాను ఫెయిలయి మా పీకల మీదికి తెచ్చింది! ఇది ఒక చిన్న దీవి! మనుష్య సంచారం ఆనేది ఏళ్ళ తరబడి లేని ఓ అజ్ఞాత దీవి!

ఇక మా దారి మేము చూసుకొంటాం. ఫెయిలయ్యే ప్లాను వేసినందుకు నీకు శిక్షగా లెదర్ బాగ్ మేము తీసికెళ్ళిపోతున్నాం!

నీవు మమ్మల్ని వెంబడించాలనుకోవడం నీకే ప్రమాదం! మా వద్ద ఆయుధాలున్న సంగతి నీకూ తెలుసు!—"

డేనియల్, కోదండం రాసిన ఆ కాగితం చదవగానే కోపంతో సుందరరాజన్ కళ్ళు ఎర్రబడ్డాయి. డబ్బు పోయిందన్న బాధ, జరిగిన మోసం అతన్ని నిర్వీర్యుణ్ణి చేశాయి!

కత్తి బయటికి తీశాడు. కసిగా దాన్ని ఆ కాగితం మీద గుచ్చాడు. క్షణంలో డేనియల్ కోదండాల్ని ఇద్దర్నీ ముక్కలు ముక్కలుగా నరికి పారేయాలనిపించిందతడికి.

కాసేపటికి తేరుకున్నాడు సుందరరాజన్. చీకటిపడుతూందని గ్రహించాడు. అజ్ఞాతదీవి! కీకారణ్యం, ముసురుకొంటున్న చీకటి. ఒంటరిగా వున్న అతడిని ఒణికించాయి!

మధ్యాహ్నానికి, ఇప్పటికి తన పరిస్థితి తల్చుకొంటే చిత్రంగా అనిపించింది. కేవలం ఊహించని గాలి తుఫానే తన భవిష్యత్తును నాశనం చేసిందని అతడి నమ్మకం!

చీకటి పూర్తిగా ఆవరించింది. సుందరరాజన్ తల పైకెత్తాడు. చెట్టు బాగా పెద్దది. బలమైన కొమ్మలు శాఖోపశాఖలుగా వున్నాయి. ముఖ్యంగా చెట్టుపైకి ఎక్కడానికి అనుకూలంగా వుంది.

తిండిమాట అటుంచి తెల్లవారేటప్పటికి రక్షణకోసం

యేదో ఒక నివాసం చూడకపోతే, ఏ క్రూరమృగానికో తాను ఆహారంకాక తప్పదని భయం పుట్టిం దతడికి.

మెల్లగా చెట్టు యెక్కసాగాడు. అతడి ఒక కాలు కుంటి కావడం వలన ఒంటి కాలితో యెక్కవలసి వచ్చింది. పళ్ళ బిగువున బాధను బిగబట్టి పైకి చేరు కొన్నాడు. ఒక విశాలమైన కొమ్మ సమాంతరమైన రెండు పాయలుగా చీలినచోట అనువుగా అనిపించింది.

అక్కడ వాలిపోయాడు. అతడికి ప్రాణం కొద్ది కుదుటపడినట్టనిపించింది. నడుం దగ్గర గాయం మాత్రం మండుతూంది. డేనియల్, కోదండంలపై ఎలా పగ తీర్చు కోవాలా అన్న ఆలోచనలో పడింది అతడి బుర్ర.

మద్రాసు జైలునుండి తప్పించుకొని పారిపోతూ తనకు తారసపడిన నేరస్థులు వాళ్ళు. తనూ మాజీ నేర స్థుడే. వాళ్ళు దొంగతనాలకు మారంగా వుండిపోయిన తను ఆఖరిసారిగా అతిపెద్ద దోపిడీ చేసి సుఖంగా జీవిం చాలనుకొన్నాడు ఆ డబ్బుతో! కానీ విధి వక్రించింది!

ప్రస్తుతం డేనియల్, కోదండాల్ని ఏదోవిధంగా అంతం చేస్తేగానీ ఆ డబ్బు తనకు దక్కదు....ఇలా సాగుతున్నాయి సుందరరాజన్ ఆలోచనలు.

## 5

తెల్లవారింది—

పక్షుల అరుపులకు మెలకువ వచ్చింది సుందరరాజన్‌కి. పచ్చటి ఎండ చెట్టుపై పడుతూంది. ఆకులను చీల్చుకొని వస్తూన్న సూర్యకిరణాలు అతడి కళ్ళల్లోపడి యిబ్బంది కలిగిస్తున్నాయి.

జాగ్రత్తగా క్రిందికి దిగాడు. నడుం దగ్గర మండు తున్నట్టనిపించింది పట్టు విప్పి చూసుకున్నాడు! గాయం

దగ్గర రక్తం గడ్డకట్టింది. నొప్పి వుంది. అది క్రమేణా పుండుగా మారే ప్రమాదం ఉందని తెలుసతడికి.

ప్రత్యేకంగా గుడ్డముక్క ఏదీ లేకపోవడంతో, కోటు లోపల చిరుగులు పట్టిన షర్టును మడత పెట్టి నడుంచుట్టూ బలంగా కట్టాడు. పైన మామూలుగా కోటు వేసు కున్నాడు. కట్టువల్ల గాలి తగిలి గాయం చెదిరే ప్రమాదం లేదు. అయితే త్వరగా మందు కూడా వేయడం అవశ్యక మని తెలుసు అతడికి!

అంతవరకూ దాగి వున్న ఆకలి మెల్లగా విజృంభి స్తూంది అతడిలో! కడుపు నింపుకోవడానికి ఏవో ఒక పళ్ళు తప్పక దొరుకుతాయన్న ఆశ వుంది అతడిలో. ముందు తాను నడవడానికి మంచి కర్ర తయారుచేసు కోవాలనుకొన్నాడు.

చాలాసేపు అక్కడ వెదికి మంచి కర్ర తీసాడు. కత్తితీసి దానిని ఓపిగ్గా తనకు కావలసిన రీతిలో, పైచివర వెడల్పాటి ఒంపు వుండేలా తయారుచేసాడు... దానిని ఉపయోగించి నాలుగైదు అడుగులు అటూ ఇటూ నడిచి చూశాడు. సౌకర్యంగానే ఉందది! తృప్తిగా నిట్టూర్చాడు.

కత్తి నడుంకు కట్టిన షర్టులో దోపుకొన్నాడు. కర్ర సాయంతో నెమ్మదిగా నడుస్తూ చెట్లను, పొదలను గమ నిస్తూ ఆహారాన్ని వెదుక్కుంటూ నడవసాగాడు.

ఎంత తిరిగినా మంచి ఫలాలున్న వృక్షాలేమీ అతడికి కనిపించడంలేదు! రెండు మూడు చోట్ల కొన్ని పళ్ళు కనిపించినా అది బాగా వగరుగా ఉండడంతో కొరికి వదిలేశాడు!

అకస్మాత్తుగా ఒకచోట ఆగిపోయాడతడు!?

ఆశ్చర్యంతో ఏదో తెలీని భయంతో అతడి శరీరంపై రోమాలు కంపించాయి! అయినా నమ్మలేనట్టు వీలయినంత పరీక్షగా చూశాడు!

అక్కడంతా బాగా చీకటి ప్రదేశం. దట్టమైన చెట్లు గోడల్లా చుట్టూ క్రమ్ముకొని ఉన్నాయి. సూర్యకాంతి లోపలకు చొరబడే అవకాశం ఏమాత్రం లేదు!

ఎదురుగా పెద్దకొండశ్రేణిని ఆనుకొని చీకటి గుహ కనిపిస్తూంది. దానిచుట్టూ చెట్లూ చేమలు అల్లుకొని పోయాయి. గుహను పూర్తిగా మూసివేయడానికి ప్రయత్నిస్తూంది అక్కడి వృక్ష సంపద!

అక్కడ లావాటి నల్లటి బద్దలు నిలువుగా చీకట్లో కలిసిపోయి ఉండడం పాదలమధ్యనుండి అస్పష్టంగా కనబడుతూంది. వాటి వెనుక బరివి గడ్డాలతో తెల్లని ఆకారాలు ఉండడం చూసి ఒడలు గగుర్పొడిచాయి సుందరరాజన్ కు!?

ఆకారాలు ఊచల దగ్గరగా వచ్చి అతడిని చూస్తున్నాయి....పిలుస్తున్నాయతడిని!

చెమటలు తుడుచుకున్నాడు అతడు. రెండు నిమిషాలాగి భయాన్ని కంట్రోల్ చేసుకుంటూ చీకటిలోనికి మరింత పరీక్షగా చూశాడు.

ఆ ఆకారాలు మనుష్యులే! తల, గడ్డాలు విపరీతంగా పెరగడం వలన చీకటిలో వాళ్ళు భయానకంగా కనిపిస్తున్నారు!

అప్రయత్నంగా అడుగులు ముందుకేసాడు. పట్టపగలే అంత చీకటిగా ఉన్న ఆ ప్రదేశంలో వాళ్ళెందుకుంటున్నారో అర్థంకాలేదతడికి?

వాళ్ళను సమీపించాడు. తెల్లటివాళ్ళ దేహాల్ని బట్టి

వాళ్ళు శ్వేతజాతీయులని తెలుస్తోంది. మొత్తం నలుగురున్నారు. ఒంటిపై పాంట్లు మాత్రమే ఉన్నాయి వాళ్ళకు. అవీ చాలావరకూ శిధిలమైపోయాయి. దట్టంగా వున్న కనుబొమ్మల క్రిందనున్న వాళ్ళ కళ్ళు అతడ్ని అభ్యర్థనగా చూస్తున్నాయి.

క్రమంగా అతడి కర్థమయింది! ఇనుప కటకటాల బోనులో వాళ్ళు బంధించబడ్డారని.... వాళ్ళక్కడ ఎన్నో ఏళ్ళు తరబడి వుంటున్నట్టు వాళ్ళ ఆకృతిని బట్టి గ్రహించాడు!!

తుప్పుపట్టిన ఇనుపబద్దలు పట్టుకొని ఒక ఖైదీ గొంతు సవరించుకొని సుందరరాజన్‌ని అడుగుతున్నాడు ఇంగ్లీషులో "మిస్టర్....ప్లీజ్....ప్లీజ్....ఓపెన్ ది లాక్!"

సుందరరాజన్ అయోమయంగా చూశాడు. వాళ్ళు అడుగుతూనే వున్నారు. చేతులు చాస్తున్నారు. కటకటాలనుండి అతడిని అందుకోవడానికి....అప్రయత్నంగా అడుగు వెనక్కి వేశాడు.

కొద్దిక్షణాలలో అతడి భయం తగ్గుముఖం పట్టింది. స్వచ్ఛమైన వాళ్ళ మాటలు వినగానే, చీకట్లో దేని కోసమో వెదికాడు. కొండ అంచువద్ద ఇనుపబద్దలను కలుపుతూ వేయబడిన పెద్ద తాళంకప్ప కనిపించింది! నల్లటి ముద్దలా కనిపిస్తూందది.

తెల్లజాతీయులు కటకటాలలోనుండి దానిని అందుకోవడానికి ఏమాత్రం వీలులేకుండా, ఓ రాతి వంపు చివర అమర్చబడి ఉందా తాళం! కాసేపు అక్కడ వెదికి పెద్ద రాయి సంపాదించాడు.

అంతలోనే అతడిలో ఏదో అనుమానం తలెత్తింది! ఎప్పటినుండో నాగరిక ప్రపంచంతో సంబంధాలు లేని

రాతిమనుషులు వాళ్ళు. తలుపు తెరవగానే తనమీదపడి చంపేస్తే!!

ఆలోచిస్తూన్న సుందరరాజన్‌ను చూసి, అతడి అనుమానాలు పసిగట్టిన వాడల్లే ముందు మాట్లాడిన ఖైదీయే చెప్పాడు. "మిస్టర్! నీకేం భయంలేదు. అనుమానించకుండా విడిపించు మమ్మల్ని. కావలిస్తే ఇదిగో ఈ ఆహారం తీసుకో" అంటూ ఏవో లావాటి దుంపలు అతడి కందించాడు.

ఆకలిమీద ఉన్న సుందరరాజన్ దుంప కొంటసి రుచి చూసాడు. రుచిగానే వుంది! ప్రస్తుతం అమాత్రం రుచి చాలు అతడికి. క్షణాలలో పూర్తిచేశాడు వాటిని.

తర్వాత ఇక సంకోచించకుండా రాతితో తాళం పగలగొట్టి, అక్కడ అడ్డుగా ఎదిగిన మొక్కలను కత్తితో నరికివేసి తలుపు బలమంతా ఉపయోగించి లాగాడు! వాళ్ళు కూడా అటువైపునుండి తోయడంతో అది తెరుచుకొంది....!

## 6

సుందరరాజన్‌తోపాటు ఖైదీలు నలుగురూ వెలుగులోనికి నడిచివచ్చారు. వాళ్ళ ఆనందం పట్ట శక్యం గాకుండా వుంది!

కాసేపు నృత్యాలు చేశారు. మరికాసేపు సంతోషం పట్టలేక పిచ్చిగా నవ్వుతున్నారు. అటూ ఇటూ ఉత్సాహంగా గెంతుతూ సుందరరాజన్‌ని కూడా పట్టుకొని తమతో గెంతించారు.

కాసేపటికి అతడు వాళ్ళకు మంచి మిత్రుడయ్యాడు. ఆ దీవిలోనికి అతడెలా వచ్చిపడ్డాడో అడిగారు వాళ్ళు.

పేరాచూట్‌లతో సాహసాలు చేస్తూ ప్రమాదవశాత్తు యిక్కడ పడ్డానని చెప్పాడు. అయితే దీవిలో వున్న మరో యిద్దరు తనకు ప్రధాన శత్రువులని డేనియల్, కోదండంల నుద్దేశించి చెప్పాడు వాళ్ళకు. అంతకుమించి అతడి విషయంలో పెద్ద ఆసక్తి చూపించలేదు వాళ్ళు.

"మీరసలు ఆ చీకటికొట్లో ఎలా బంధితులయ్యారు?!" ప్రశ్నించాడు సుందరరాజన్. సంభాషణ ఇంగ్లీషులోనే సాగుతూంది.

తెల్లజాతీయుడు నిట్టూర్చాడు. అతడి ముఖంలో నిరాశా మేఘం క్రమ్ముకుంది. "మేము దురదృష్ట జంతులం! మాది థాయ్‌లాండ్. మేం నలుగురం ఒకే కాలనీలో వుండేవాళ్ళం. దేశంలో ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలు, అల్లర్లు చెలరేగిన సమయంలో ప్రభుత్వ వ్యతిరేక వాదులు కొందరు సీక్రెట్ ఏజంట్లు అనుమానించడంతో ప్రభుత్వ వ్యతిరేకతత్వాన్ని ప్రోత్సాహించే విప్లవసాహిత్యపు పుస్తకాల్ని మా ఇళ్ళల్లో దాచేసి వెళ్ళిపోయారు.

అదే మా పాలిట శాపమయింది. సీక్రెట్ ఏజంట్లు మమ్మల్ని కస్టడీలోనికి తీసుకున్నారు. మాపై ఉగ్రులయిన మా పైనిశాధికార్లు మాకీ శిక్ష విధించారు!" చెప్పాడు.

"వెరీబాడ్!" తల పంకించాడు సుందరరాజన్. వాళ్ళను పరిశీలనగా చూశాడు. వాళ్ళ ఎర్రటి తలలు విపరీతంగా పెరిగి అట్టకట్టి వున్నాయి. ఒకరిద్దరి తలలు చాలాచోట్ల తెల్లగా పండిపోయాయి. కాళ్ళూ చేతుల గోళ్ళు అస్తవ్యస్తంగా పెరిగి వున్నాయి.

"ఎన్నాళ్ళయింది మీరిక్కడ బంధించబడి?" మళ్ళీ

అడిగాడు.

"మేమిక్కడికి 1978లో వచ్చాం! అది మాత్రమే గుర్తుంది."

"మై గాడ్! తొమ్మిది సంవత్సరాలు అయింది. అన్ని సంవత్సరాలు అందులో ఎలా వుండగలిగారు? ఇన్నాళ్లూ ఏం తిని బ్రతికారు!?" తెల్లబోతూ అడిగాడు.

"అది మా ఖర్మ! ఏనాడయినా మేము బయటి ప్రపంచాన్ని చూడకపోతామా అన్న ఆశతోనే ఇన్నాళ్ళూ ప్రాణాలుగ్గబట్టుకొని జీవించాము! దేవుడు మాకు యింకా ఆయుస్సు ఇవ్వడంతో మమ్మల్ని బంధించిన చోటే ఒక రకమైన దుంపల పాళల ఉండడం చూశాము! ఈ తొమ్మిది సంవత్సరాలు అవే తిన్నాం. ఇక్కడ రాతికొండ చుట్టూ మొలచిన చెట్లవల్ల ఆ దుంపలు తయారవుతూ ఉండవచ్చు.

గుహలోపల కొండరాళ్ళ మధ్యనుండి ప్రవహించే నీటివాగే మా దాహం తీర్చేది! బయట ప్రపంచాన్ని చూడాలన్న మా ఆశ నిరాశ కాలేదు. నీద్వారా మేము తిరిగి స్వేచ్ఛా జీవులమయ్యాం! నువ్వు చేసిన మేలు మాత్రం మరువలేనిది" అన్నాడు. అతడితో పాటు మిగతా వాళ్ళు కూడా సుందరరాజన్‌ను కృతజ్ఞతగా చూశారు.

తనపై వాళ్ళకుగల కృతజ్ఞత అర్థమయ్యేకొలది సుందరరాజన్ ఆలోచనలు పరుగులుతీయసాగాయి.

"నేను మీకు సాయం చేశాను. ప్రతిగా మీరుకూడా నాకో సాయం చేస్తేనే సమంజసం!" చెప్పాడతను మెల్లగా.

"ఏమిటది? చెప్పండి!" అడిగాడో తెల్లజాతీయుడు.

అతడు చెప్పాడు. "నేను మీకు మిత్రుడిని. నా

శత్రువులు మీకూ శత్రువులవుతారు! అదే మీరు చేయవలసింది!"

సందేహంగా చూశారు వాళ్ళు?

"డేనియల్, కోదండం నాకు శత్రువులని ఇందాకే చెప్పాను. వాళ్ళు నాకు చేసిన ద్రోహం చెప్పాలంటే చాలా వుంది! అది యిప్పుడు అప్రస్తుతం! మనం ఐదుగురం కలసి ముందు వాళ్ళను మట్టుపెట్టాలి—ఆ తర్వాతే ఈ దీవిలో నుండి బయటపడడానికి ప్రయత్నించాలి!" చెప్పాడతడు వాళ్ళ ముఖం వంక చూస్తూ.

నలుగురూ ఒకరి వంక ఒకరు చూసుకున్నారు.

"మిస్టర్ రాజన్! చేయని నేరానికి మేము ఇన్నేళ్లు బంధిఖానా అనుభవించాం. ఆ ప్రభావం నుండి మేమింకా కోలుకోలేదు. హత్యలు లాంటి నేరం చేసేటంత ధైర్యం శక్తి మాకు లేవు. కావలిస్తే నీకు తోడుంటాం!"

అది విని సుందరరాజన్ మిన్నకుండిపోయాడు. అతడి ముఖం వాడింది. ఇక చేసేదిలేక కాసేపాగి చెప్పాడు. "సరే! అలాగే చేయండి. ప్రస్తుతం వాళ్ళు ఇక్కడి నుండి బయటపడడానికి, పడవలాంటిది యేదో తయారు చేసే ప్రయత్నంలో వుంటారు తప్పకుండా....! మనం వాళ్ళను కనిపెట్టాలి ముందు!"

"అవును. దేనికయినా ముందు వాళ్ళ ఉనికి తెలుసుకోవడం ముఖ్యం!" చెప్పాడు ఒక తెల్లజాతీయుడు.

సుందరరాజన్‌తో మొదట మాట్లాడిన తెల్లజాతీయుడు చెప్పాడు "అలా అయితే తీరప్రాంతంలోనే వాళ్ళు యెక్కువగా ఉండటానికి అవకాశం వుంది! పడవ తయారుచేసుకొనే ప్రయత్నాలలో ఉన్నవాళ్ళు, ముఖ్యంగా తీరప్రాంతాల్లో వెదికితే దొరుకుతారు...."

ప్రశంసనీయంగా మారాడు సుందరరాజన్ అతడి వంక. చాలావరకూ కరట్టే అతడు చెప్పింది.

ఐదుగురూ కదిలారు. సుందరరాజన్ కుంటుతూ నడవడం మూలంగా వారి అన్వేషణ మందంగా సాగుతూంది.... దారిలో ఒకటి రెండు నీటి చెలమలు తగలడంతో దాహం తీర్చుకున్నారు. మధ్యాహ్నపు ఎండ ఒంటిని చుర్రుమని కాల్చేటంత వేడెక్కే వరకూ తిరిగారు వాళ్ళు. వారి ప్రయత్నం ఫలించింది అప్పటికి....!

## 7

దూరంగా సముద్రపు ఒడ్డున ఇసుకలో కనిపించిన వ్యక్తుల్ని డేనియల్, కోదండం అని గుర్తించి టెన్షన్‌గా ఆగిపోయాడు సుందరరాజన్.

మిగతావాళ్ళు కూడా చూస్తున్నారు వాళ్ళను. సుందరరాజన్ చెప్పకుండానే అతడి ముఖం చూసి తమ శత్రువులు వాళ్ళేనని గ్రహించారు.

"మనం అలా చెట్లలోనికి వెళదాం!" సాలోచనగా యెదురుగా వున్న మెరక పైకి దారితీసాడతడు. ఐదుగురూ చెట్లలోపలినుండి వాళ్ళను సమీపించారు!

అప్పటివరకూ సముద్రపు ఒడ్డున తిరుగుతూ ఎండ ఉధృతాన్ని భరించిన వాళ్ళకు, ఇరవై ముప్పై అడుగుల ఎత్తున గూడులా అల్లుకొన్న చెట్లు చల్లదనాన్ని ఇవ్వసాగాయి. క్రింద నేలంతా ఊటపట్టి నల్లటి బురదతో కూడుకొని చిత్తడి చిత్తడిగా వుంది. దీవిలో పక్షులు, పాములు మినహా క్రూరమృగాల ఉనికి ఏ మాత్రం లేకపోవడం చూచాయగా గమనించారు వాళ్ళు.

ఆగారు వాళ్ళు! శత్రువులకు బాగా దగ్గరగా రావడంతో చెట్లచాటునుండి చూడసాగారు. అప్పటికే

డేనియల్, కోదండం పడవ ఒకటి సగం తయారు చేశారు. తేలికపాటి అడివి చెట్లను, కొమ్మలను నరికి ముక్కలు వేస్తూ తయారుచేస్తున్నారు దాన్ని!

"వాళ్ళే కదా! ఏం చేద్దాం?" అడిగాడో తెల్ల జాతీయుడు, సుందరరాజన్ వైపు చూస్తూ గుసగుసగా.

సుందరరాజన్ కాసేపు చెట్లలోంచి చూసి, చెప్పాడు తర్వాత. "వాళ్ళ దగ్గర కొన్ని ఆయుధాలున్నాయి. ముందు మనం ఒక ఆయుధం అయినా స్వాధీనం చేసుకోవాలి..అప్పుడు మెరుపుదాడి చేయాలి!"

"ఏం ఆయుధాలవి?!" కొద్దిపాటి కంగారుతో అడిగాడు తెల్లజాతీయుడు.

"రెండు స్టెన్‌గన్‌లు, పిస్టళ్ళు!" చెప్పాడు.

స్టెన్‌గన్‌లు అనగానే తనూహించినట్టుగానే, వాళ్ళ కళ్ళల్లో బెదురు దోబూచులాడడం గమనించాడు సుందరాజన్.

మళ్ళీ అన్నాడు. "మనం వాటిని స్వాధీనం చేసుకోగలిగితే వాటి ప్రమాదం మనకు తప్పుతుంది సరికదా మన పని మరింత తేలికవుతుంది...."

"కానీ వాళ్ళు చూస్తే ఆయుధాలు నిరంతరం ధరించే తిరుగుతున్నట్టున్నారే!" దూరంగా వున్న వాళ్ళను గమనిస్తూ అడిగాడు తెల్లజాతీయుడు.

"కాసేపు ఓపికపడదాం!" చెప్పాడు సుందరరాజన్.

చాలాసేపు ఆగారు వాళ్ళక్కడ! దూరంగా సముద్రపు ఒడ్డున ఎర్రటి ఎండలో డేనియల్, కోదండం పడవ నిర్మించడంలో నిమగ్నమయి వున్నారు.

కాసేపు గడిచింది. డేనియల్ చెట్లదగ్గరికి రాసాగాడు! తెల్లజాతీయులు కొద్దిగా కంగారుపడ్డారు. చెట్ల

లోనికి వచ్చి ఆగిపోయాడతడు. నీడకోసం వచ్చాడతడు కాసేపు. భుజానికి తగిలించుకొన్న స్టెన్‌గన్ తీసి ఒక చెట్టుబోదెకు జారవేసాడు! ఉస్సురని నిట్టూర్చి అక్కడే కూలబడ్డాడు విశ్రాంతిగా.

సుందరరాజన్ కళ్ళు ఆత్రంగా వెదికేస్తున్నాయి అక్కడి ప్రదేశాన్నంతా. ఎక్కడయినా అందుబాటులో లెదర్ బాగ్ కనిపిస్తుందేమోనని అతడి ఆశ!

ఇంతలో కోదండాన్ని పిల్చాడు డేనియల్. "కోదండం! బాగా చల్లగా వుందిక్కడ. నువ్వు కూడా రా కూర్చుందాం కాసేపు...."

కోదండం ఒకసారి చెట్లవయిపు చూచి మళ్ళీ తన పనిలో నిమగ్నమయ్యాడు. అతడికి పని వెంటనే అయి పోవాలనుంది. అతడు రాకపోవడంతో ఐదునిమిషాలాగి డేనియల్ లేచి తిరిగి పడవ దగ్గరకు నడిచాడు.

సుందరరాజన్ ముఖం ఆనందంతో విచ్చుకొంది. ఒక తెల్లజాతీయుడివైపు చూశాడు ప్రోత్సాహంగా!

అతడు కాసేపు సంకోచించాడు. మిగతా వాళ్ళు కూడా కళ్ళతో సైగచేయడంతో, మెల్లగా ఊపిరి బిగ బట్టి ముందుకు అడుగులు వేశాడతడు!

క్రింద చెమ్మగా వున్న మట్టిలో చప్పుడు గాకుండా నడుస్తూ కదిలాడు. డేనియల్ చెట్టుదగ్గర వదిలేసిన స్టెన్ గన్ వద్దకు చేరుకొన్నాడు....!

వెనగ్గా మిగతా నలుగురూ కదలకుండా టెన్షన్‌గా చూస్తున్నారు. ఏక్షణాన్నయినా డేనియల్ వెనక్కి తిరిగి మెరుపులా పిస్టల్‌తీసి పేలుస్తాడేమోనన్న భయం సుందరరాజన్‌లో ఉంది!

తెల్లజాతీయుడు గన్ అందుకొన్నాడు! శబ్దం చేయకుండా వెనక్కి తిరిగాడు.

నలుగురూ చూస్తున్నారు. తెల్లజాతీయుడు వాళ్ళను సమీపిస్తున్నాడు. క్రింది తడి నేలలో పైనుండి రాలిన ఎండుటాకులు వున్నాయి అక్కడక్కడ!

ఇసుకలో నడుస్తూన్న డేనియల్ ఏదో చప్పుడుకి అసంకల్పితంగా వెనుదిరిగి చెట్లమధ్యనుండి జరిగేది చూశాడు....!!

(ముగింపు వచ్చేసంచికలో)